క్లుప్తంగా

వాకర్స్ క్లబ్ సభ్యులకు ఐడీ కార్డులు



బుచ్చయ్యకు గుర్తింపు కార్డు అందిస్తున్న ద్వారకానాథ్

మురళీనగర్: మురళీనగర్ వాకర్స్ క్లబ్ ప్రాంగణంలో ఆదివారం వాకర్లకు ఫొటో గుర్తింపు కార్డులను అందజేశారు. వాకర్స్ ఇంటర్నేషనల్ సెక్రటరీ కె.ద్వారకానాథ్ మొదటి ఐడీ కార్డును వాకర్స్ పార్కు పూర్వ అధ్యక్షుడు నిమ్మగడ్డ బుచ్చయ్యకు అందజేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం క్లబ్ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి వాకర్స్ పార్కు సభ్యులందరికీ గుర్తింపు కార్డులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కార్యదర్శి లంకా సుధాకర్, ఉపాధ్యక్షుడు ఎం.రామకృష్ణ, కోశాధికారి జె.కూర్మారావు, జాలీ వాకర్ ఎన్.ప్రకాశరావు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

కథలతో మేధో వికాసం



లైబ్రరీలో కథలు చదువుతున్న విద్యార్థులు

మురళీనగర్: సమ్మర్ క్యాంప్‌లో భాగంగా ఆదివారం మురళీనగర్ మహిళలు, పిల్లల శాఖ గ్రంథాలయంలో విద్యార్థులతో కథలు చదివించారు. గ్రంథాలయ అధికారి వై.పద్మజ ఆధ్వర్యంలో కథలు చదివించడం, వాళ్ల చేత చెప్పించడం జరిగింది. ఆధ్యాత్మిక వేత్త కె.కాశీ విశ్వనాథ్ రిసోర్స్ పర్సన్‌గా పిల్లలకు కథలపై కొన్ని విషయాలను తెలియజేశారు. మేధో వికాసానికి కథలు చదవాలని సూచించారు. పిల్లలతో క్యారమ్ బోర్డు ఆడించారు. అనంతరం చాక్లెట్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. పాఠకులు పాల్గొన్నారు.

ముగిసిన వేసవి శిక్షణ శిబిరం



ముగింపు వేడుకల్లో పాల్గొన్న చిన్నారులు

కంచరపాలెం: స్థానిక బొట్టా నర్సింగరావు భవనంలో వైజాగ్ చిల్డ్రన్స్ క్లబ్, బీఎస్ఆర్ ఫౌండేషన్‌ల ఆధ్వర్యంలో నిర్వహించిన వేసవి శిక్షణ తరగతులు ఆదివారంతో ముగిసినట్లు కంచరపాలెం జోన్ కమిటీ సభ్యుడు కృష్ణరావు తెలిపారు. ఈ సమ్మర్ క్యాంప్‌లో విజ్ఞానంతో కూడిన వినోదాత్మక అంశాలపై ప్రతి రోజూ శిక్షణ ఇచ్చామన్నారు. వేసవి శిబిరాన్ని సద్వినియోగం చేసుకున్న చిన్నారులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు, ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు జెర్సీల పంపిణీ



ఫుట్‌బాల్ శిక్షణలో పాల్గొన్న యువకులతో క్లబ్ ప్రతినిధులు


దాబాగార్డెన్స్: పోర్టు యూనియన్ ఫుట్‌బాల్ క్లబ్ (ఎఫ్‌యూఎఫ్‌సీ) ఆధ్వర్యంలో 39వ వార్డు పరిధి సెయింట్ అల్లాయిస్ క్రీడా మైదానంలోని ఫుట్‌బాల్ వేసవి శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా శిక్షణ పొందుతున్న క్రీడాకారులకు ఆదివారం జెర్సీలు అందజేశారు. ఈ శిక్షణ తరగతులు వచ్చే నెల 4 వరకు నిర్వహించనున్నట్లు క్లబ్ కార్యదర్శి మోది గణేశ్వరరావు తెలిపారు. ప్రతి ఏడాది ఈ శిక్షణ శిబిరం నిర్వహిస్తూ వస్తున్నామన్నారు. కార్యక్రమంలో కోటవీధి ఫుట్‌బాల్ క్రీడాకారులు పాల్గొన్నారు.

పిట్ట కొంచెం.. కూత ఘనం

- కరాటేలో చిచ్చరపిడుగు దర్శి జోయల్ జోష్
- బ్లాక్ బెల్ట్‌తోపాటు ఎన్నో పతకాలు కైవసం
- చదివేది ఏడో తరగతి
- ఐదో ఏట నుంచే సాధన



సర్టిఫికెట్ అందుకుంటున్న జోయల్ జోష్(ఫైల్)



కరాటే సాధనలో..



గోల్డ్ మెడల్స్‌తో జోష్



కరాటే పోటీల్లో ప్రతిభ చూపుతున్న చిన్నారి దర్శి జోయల్ జోష్ (ఫైల్)

సీతమ్మధార: కరాటేలో అద్భుతమైన ప్రదర్శన ఇస్తూ దూసుకుపోతున్నాడు 24వ వార్డు నక్కవానిపాలేనికి చెందిన దర్శి జోయల్ జోష్. ప్రత్యర్థులను చిత్తు చేస్తూ పతకాలు కైవసం చేసుకుంటున్నాడు. చిన్నతనంలోనే బ్లాక్ బెల్ట్ సాధించి అందరితో శభాష్ అనిపించుకున్నాడు. సీతమ్మధార ఎస్ఎఫ్ఎస్ స్కూల్‌లో ఏడో తరగతి చదువుతున్న 11 ఏళ్ల జోయల్ జోష్ ఐదో ఏట నుంచే కరాటేపై మక్కువ చూపించాడు. కుమారుడి ఆసక్తిని గుర్తించిన తల్లిదండ్రులు దర్శి శ్రీధర్, స్వర్ణలత కరాటేలో జోయల్‌ను ప్రోత్సహించారు. ఐదో ఏట నుంచి స్కూల్‌లో కరాటేలో శిక్షణకు పంపించేవారు. పీఎస్ఆర్ మార్షల్ ఆర్ట్స్ చీఫ్ ఇన్‌స్ట్రక్టర్, ఎగ్జామినర్ పి.నరసింహారావు, జి.శివరామకృష్ణ వద్ద కరాటేలో శిక్షణ పొందుతున్నాడు. ఇటీవల అంబేడ్కర్ భవన్‌లో నిర్వహించిన కరాటే పోటీల్లో అతి చిన్న వయసులో బ్లాక్ బెల్ట్ సాధించి.. అందరినీ ఆశ్చర్యపరచి పలువురి మన్ననలు పొందాడు. ఈ సందర్భంగా స్కూల్ ప్రిన్సిపాల్ ఫాదర్ మనోజ్, వార్డు కార్పొరేటర్ సాడి పద్మారెడ్డి జోయల్ జోష్‌ను ఆశీర్వదించి అభినందించారు.

జోయల్ సాధించిన పతకాలు

- 20వ ఆంధ్రప్రదేశ్ కరాటే చాంపియన్‌షిప్-2022లో జరిగిన అండర్-10 బాలుర విభాగం(సబ్ జూనియర్) పోటీల్లో బంగారు పతకం సాధించాడు.
- స్వర్ణభారతి ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన నేషనల్ కరాటే చాంపియన్‌షిప్‌లో బంగారు పతకం గెలుపొందాడు.
- 2016లో విశాఖ రామాటాకీస్ రోడ్డులోని అంబేడ్కర్ భవన్‌లో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో కాటా విభాగంలో బంగారు పతకం, కుమ్మిట్‌లో సిల్వర్ మెడల్ సాధించాడు.
- 2023లో షోటోకాన్ ఇండియన్ కరాటే-డు, అసోసియేషన్ వారు జోష్ ప్రతిభను గుర్తించి ఫస్ట్ డాన్ బ్లాక్ బెల్ట్‌ను అందజేశారు.
- ఆర్కే బీచ్‌లో జరిగిన ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో పాల్గొని మినిస్ట్రీ ఆఫ్ కల్చర్ వారి నుంచి అవార్డుతోపాటు సర్టిఫికెట్ అందుకున్నాడు.
- 2021 జనవరిలో మూడో కేవైయూ, సెప్టెంబర్‌లో రెండో కెవైయూ, 2022 జూలైలో ఫస్ట్ కేవైయూ బ్రౌన్ బెల్ట్ సాధించాడు.
- 2018 డిసెంబర్‌లో ఎల్లో 8వ కేవైయూ సర్టిఫికెట్ అందుకున్నాడు.
- 2018-19 సెప్టెంబర్‌లో గ్రీన్ బెల్ట్, ఆరో కేవైయూ సర్టిఫికెట్ పొందాడు.

విశాఖకు పేరు తెస్తా..

బ్లాక్ బెల్ట్ సాధించిన సందర్భంగా 'సాక్షి'తో కరాటే చిచ్చరపిడుగు జోయల్ జోష్ మాట్లాడుతూ జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని కరాటే మాస్టర్‌గా గుర్తింపు సాధిస్తానని ఆశాభావం వ్యక్తం చేశాడు. పెదనాన్న దర్శి శ్రీజోష్ ప్రోత్సాహంతో కరాటేలో శిక్షణ పొంది బ్లాక్ బెల్ట్ సాధించినట్లు తెలిపాడు. మరిన్ని విజయాలు సాధించి దేశానికి, రాష్ట్రానికి మంచిపేరు తీసుకొస్తానన్నాడు. ప్రపంచ దేశాల్లో విశాఖ గొప్పతనం వెలుగొందేలా కరాటే పోటీల్లో ప్రతిభ చూపిస్తానని చెప్పాడు.

ఇతరుల కోసం సమయం కేటాయించండి



వైట్‌బోర్డులు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్సీ శర్మ

సీతంపేట: విజయానికి చదువు ఒక్కటే కొలమానం కాదని, సమాజంలో ఇతరుల కోసం కొంత సమయం కేటాయించడమే నిజమైన సక్సెస్ అని మాజీ ఎమ్మెల్సీ ఎం.వి.ఎస్.శర్మ అన్నారు. ఆసరా చారిటబుల్ సొసైటీ 9వ వార్షికోత్సవ సభ ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ఘనంగా జరిగింది. ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడుతూ ఆసరా సేవలను కొనియాడారు. పలు ప్రాంతాల్లో ఆసరా నిర్వహిస్తున్న ట్యూషన్ సెంటర్లకు ఆయన చేతుల మీదుగా వైట్‌బోర్డులు అందజేశారు. ఆసరా అధ్యక్షురాలు సునీత మాట్లాడుతూ 2014 నుంచి ఇప్పటి వరకు ఎన్నో సేవా కార్యక్రమాలతో తమ సొసైటీ ముందుకు వెళ్తోందన్నారు. నగరంలో ఆరు చోట్ల కుట్టు శిక్షణ కేంద్రాలు స్థాపించి ఎంతో మందికి ట్రైనింగ్ ఇస్తున్నట్టు తెలిపారు. జువనైల్ హోంలో బ్రిడ్జి స్కూల్ ఏర్పాటు చేసి విద్యార్థులకు చదువుతోపాటి నైతిక విలువలు తెలిపే కథలు నేర్పుతున్నట్టు చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక, నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఇన్‌కంటాక్స్ అడిషనల్ కమిషనర్ గోపీకృష్ణ, కోరెడ్ల రమాప్రభ, సంజీవ్‌కుమార్, నరవ ప్రకాశరావు, శ్రీనాథ్, రాజేశ్వరి, చంద్రమౌళి, సంస్థ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తప్పుడు ఆరోపణలపై చర్యలు

తాటిచెట్లపాలెం: డివిజనల్ రైల్వే హాస్పిటల్‌లో పని చేస్తున్న సీనియర్ వైద్యులపై పలువురు చేస్తున్న తప్పుడు ఆరోపణలపై చర్యలు తీసుకుంటామని వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఎ.కె.త్రిపాఠి ఒక ప్రకటనలో తెలిపారు. వారు చేస్తున్న ఆరోపణలు పూర్తిగా నిరాధారమైనవని, అసత్యాలని ఇటీవల పలు ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్స్, దళిత్ ఫోరంలు పత్రికలకు విడుదల చేసిన ప్రకటనలను ఆయన ఖండించారు. ఈ ప్రకటనల్లో ఎంతమాత్ర వాస్తవం లేదని స్పష్టం చేశారు. రైల్వేలో పనిచేసి రిటైరైన కొందరు అనవసరంగా రైల్వే ప్రతిష్టను దిగజార్చేందుకు ఇటువంటి ఆరోపణలు చేస్తున్నారన్నారు. నిబంధనలకు అనుగుణంగా బదిలీ చేసిన ఒక వైద్యుడికి మద్దతిస్తూ, నిజాయితీగా పనిచేస్తున్న సీనియర్ వైద్యులపై తప్పుడు అట్రాసిటీ కేసులు పెట్టారని, వీటిని పెట్టిన వారిపై రైల్వే అడ్మినిస్ట్రేషన్ కఠిన చర్యలు తీసుకుంటుందని సీనియర్ డీసీఎం పేర్కొన్నారు.

'ప్రతిభ' పురస్కారాల ప్రదానం



ప్రతిభావంతులకు పురస్కారాలు అందజేస్తున్న గంట్ల శ్రీనుబాబు, దాడి సత్యనారాయణ

సీతంపేట: ప్రతిభ క్రీడా, సాంస్కృతిక సంస్థ 23వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని వివిధ రంగాల్లో ప్రతిభ చూపిన పలువురికి ప్రతిభా పురస్కారాలతో సత్కరించారు. ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో అతిథుల చేతుల మీదుగా 27 మందిని పురస్కారాలు ప్రదానం చేశారు. ముఖ్య అతిథి వీజేఎఫ్ అధ్యక్షుడు గంట్ల శ్రీనుబాబు మాట్లాడుతూ సత్కారం పొందిన ప్రతి ఒక్కరూ వారి రంగాల్లో నిష్ణాతులన్నారు. ఈ పురస్కారం వారందరికీ మరింత బాధ్యతతోపాటు మరిన్ని విజయాలు సాధించేందుకు దోహదపడుతుందన్నారు. వీజేఎఫ్ ఉపాధ్యక్షుడు నాగరాజ్ పట్నాయక్ మాట్లాడుతూ ప్రతిభ సంస్థ నిర్వహిస్తున్న కార్యక్రమాల ద్వారా ఎంతో మంది వెలుగులోకి వస్తున్నారన్నారు. మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం నాయకులు ఆళ్ల శివగణేష్, ప్రతిభ సంస్థ అధ్యక్షుడు అడవి రాజు, మేడా మస్తాన్‌రెడ్డి, న్యాయవాది ఎస్.ఎస్.ఎస్.రాజు, పి.ఎ.భాస్కరరావు, బాదంగీర్ సాయి పాల్గొన్నారు.

రాజీవ్‌కు ఘన నివాళి



రాజీవ్ గాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న గొంప గోవిందరాజు

తాటిచెట్లపాలెం: మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా ఆదివారం కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడు, ఉత్తర నియోజకవర్గ ఇన్‌చార్జి గొంప గోవిందరాజు ఘన నివాళులర్పించారు. రైల్వే న్యూకాలనీ, తాటిచెట్లపాలెం సరిహద్దు ప్రాంతంలోని రాజీవ్ గాంధీ విగ్రహానికి పూల మాలలు వేసి అంజలి ఘటించారు. దేశ శాస్త్ర, సాంకేతిక రంగాల్లో రాజీవ్ చేసిన సేవలను ఆయన కొనియాడారు. బీసీ సెల్ చైర్మన్ కాకినాడ చినబాబు, ఎస్సీ సెల్ చైర్మన్ నాగపాణి, యూత్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ సతీష్, అబీదా, సుజాత తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎర్నిమాంబ జాతర



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు



జ్ఞానాపురంలో ఎర్నిమాంబ ఆలయం వద్ద భక్తుల సందడి



మూలవిరాట్ వద్ద అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

కంచరపాలెం: జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురం, అల్లిపురం ప్రజల ఇలవేల్పు ఎర్నిమాంబ అమ్మవారి జాతరను దేవదాయ శాఖ, ఆయా సంక్షేమ సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం 5 గంటల నుంచి ఆలయ దర్శనాలకు క్యూలైన్లలో బారులు తీరిన భక్తులు అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ అర్చకుడు పులఖండం శ్రీకాంత్‌శర్మ, ఆలయ పూజారమ్మ వాసుపల్లి విజయ నేతృత్వంలో ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్, కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ, శ్రీధర్ దంపతులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. నగరం నుంచే కాకుండా ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి వచ్చిన భక్తులు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం మూలవిరాట్‌ను, సుమారు 35 అమ్మవారి ప్రతిమలను భక్తులు దర్శించుకున్నారు. అనంతరం అనుపోత్సవం ఘనంగా నిర్వహించారు. జాతరలో నేల వేషాలు, పలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. దేవదాయ శాఖ ఈవో బాబా, ఆయా సంఘాల ప్రతినిధులు, ఆలయ సిబ్బంది వేడుకలను పర్యవేక్షించారు.

వాల్తేర్ డిపో సందర్శన



డ్రైవర్లు, కండక్టర్లతో మాట్లాడుతున్న అప్పలనాయుడు

ఎంవీపీ కాలనీ: డిప్యూటీ చీఫ్ మెకానికల్ ఇంజినీర్ బి.అప్పలనాయుడు ఆదివారం వాల్తేర్ డిపోను సందర్శించారు. డిపోలోని పలు యూనిట్లను పరిశీలించి డ్రైవర్లు, కండక్టర్లతో పాటు సిబ్బందికి పలు సూచనలు చేశారు. ట్రైనింగ్‌కు అనుగుణంగా డ్రైవర్లు, కండక్టర్లు మెయింటినెన్స్ పక్కాగా చేయాలని, మెకానిక్‌లు బస్సుల కండిషన్‌ను నిత్యం పర్యవేక్షించాలని సూచించారు. ప్రయాణికులకు అందించే సేవల్లో ఎలాంటి పొరపాట్లు దొర్లకుండా చర్యలు తీసుకోవాలన్నారు. డిపో మేనేజర్ సుధాకర్, అసిస్టెంట్ ఇంజినీర్ అప్పలరాజు, సూపర్‌వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

యూనివర్సిటీ ఉద్యోగుల సమస్యలపై సమావేశం నేడు

మద్దిలపాలెం: రాష్ట్రంలో యూనివర్సిటీ బోధనేతర సిబ్బందికి ప్రభుత్వ ఉద్యోగుల మాదిరి గా పదవీ విరమణ వయస్సు 62 సంవత్సరా లు అమలు చేయాలని కోరుతూ సోమవారం జగదాంబ సీఐటీయూ కార్యాలయంలో ఆల్ ఇండియా యూనివర్సిటీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం జరగనుంది. ఈ సమావేశా నికి ముఖ్యఅతిథిగా సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు, మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు మాజరవుతారని యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు.

ఉద్యమకారుడు పావనమూర్తికి సత్కారం



ప్రొఫెసర్ పావనమూర్తిని సత్కరిస్తున్న బుద్ధిస్ట్ సొసైటీ ప్రతినిధులు

సింధియా: బౌద్ధ మతం నలుదిశలా విస్తరించేందుకు పాటుపడిన అంబేడ్కరిస్ట్, భారతీయ బౌద్ధ మహాసభ అధ్యక్షుడు, భీమ్‌దళ్ చీఫ్ కమాండర్ ప్రొఫెసర్ పావనమూర్తిని బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా(బీఎస్ఐ) విశాఖ బ్రాంచ్ ప్రతినిధులు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. 98 ఏళ్ల ప్రాయంలో మంచానికి పరిమితమైన ఆయనను సీతమ్మధారలోని స్వగృహంలో కలిసి ఘనంగా సత్కరించారు. బీఎస్ఐ సెక్రటరీ కర్రి సత్యనారాయణ మాట్లాడుతూ పావనమూర్తి దేశవ్యాప్తంగా సంచరిస్తూ తెలుగు, హిందీ, మళయాళం మొదలగు భాషల్లో తన ప్రసంగాలతో యువతను ఉత్తేజపరుస్తూ సమసమాజ స్థాపన కృషి చేశారన్నారు. అనేక పురస్కారాలు, అవార్డులు, పదవులు సొంతం చేసుకున్నారని కొనియాడారు. బీఎస్ఐ ప్రతినిధి దుర్గారావు మాట్లాడుతూ అణగారిన వర్గాల తరఫున పోరాడి న్యాయం జరిగే వరకు అలుపెరగకుండా పోరాడే వారని, కుల నిర్మూలన, బౌద్ధ ధర్మ వ్యాప్తికి చేసిన కృషి అభినందనీయమన్నారు. బీఎస్ఐ ప్రతినిధులు పెయ్యల సిద్ధార్థ, రాజారావు, యు.వి.రావ్, రాంజీ పాల్గొన్నారు.

కనకమాంబ ఆలయ అభివృద్ధి పనులు ప్రారంభం



దాతలతో కలిసి పనులు ప్రారంభిస్తున్న కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్

సీతంపేట: సీతంపేట గ్రామ దేవత కనకమాంబ అమ్మవారి(మూడు గుళ్లు) ఆలయ ఆధునికీకరణ పనులు శ్రీకృష్ణ యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం మొదలయ్యాయి. జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ మెంబర్, 25వ వార్డు కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ ముఖ్య అతిథిగా కొబ్బరికాయ కొట్టి పనులు ప్రారంభించారు. ముందుగా ఆలయ అర్చకుడు నెమ్మలూరు శివగణేష్ శర్మ వేద ఆశీర్వాదాల నడుమ విశేష పూజలు నిర్వహించారు. వచ్చే నెలలో కనకమాంబ అమ్మవారి పండగ జరగనుందని, దాతల సహాయంతో ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నట్టు సంఘ ప్రతినిధులు తెలిపారు. దాతలు నితీష్ జైన్, వినీత్ జైన్‌ల సహకారంతో ఆలయానికి మార్బుల్ ఫ్లోరింగ్, కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్, ఆయన అన్నయ్య సారిపిల్లి పోతురాజు సహకారంతో ఆలయానికి స్టీల్ గ్రిల్స్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో దాతలతోపాటు, ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ సారిపిల్లి సంతోష్, పాలకవర్గ సభ్యులు సారిపిల్లి గంగరాజు, బోర వెంకట రమణ, సానబోయిన సురేష్, ఇసరపు అప్పారావు, నమ్మి వెంకట్, గొంపా అప్పారావు, వారాధి శ్రీను, వియ్యపు సంతోష్, ఆవాల బుజ్జి, ఒమ్మి ఆనంద్, ముద్దాడ గోవింద్, వై.వెంకటరమణ, ఆవాల వెంకట్, సారిపిల్లి వెంకటరమణ, అల్లు సూరిబాబు పాల్గొన్నారు.

నేరాలకు దూరంగా ఉండండి



రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ శ్రీనివాసరావు



రౌడీ షీటర్‌ను ఇంటి వద్దకు తీసుకెళ్తున్న హెచ్‌సీ శంకరరావు

సీతమ్మధార: ఫోర్త్ టౌన్ పోలీస్ స్టేషన్ ఆవరణలో ఆదివారం రౌడీ షీటర్లకు సీఐ శ్రీనివాసరావు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎటువంటి నేరాల జోలికి పోకుండా సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. కుటుంబ సభ్యులతో కలిసి హాయిగా జీవించాలని, ఎలాంటి తగాదాల్లో తలదూర్చినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పోలీస్ నిఘా ఎల్లప్పుడూ ఉంటుందని గుర్తుంచుకుని మంచిగా నడుచుకోవాలని హితవు పలకారు. కార్యక్రమంలో ఎస్ఐలు మోహన్‌రావు, గౌరి, వెంకటరావు, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

ద్వారకా పీఎస్‌లో..

ద్వారకా జోన్ పోలీస్ స్టేషన్‌లో రౌడీ షీటర్లకు సీఐ సింహాద్రినాయుడు కౌన్సెలింగ్ చేశారు. రౌడీ షీటర్ల దినచర్య గురించి అడిగి తెలుసుకున్నారు. గొడవలు, అల్లర్లకు పాల్పడితే చర్యలు కఠినంగా ఉంటాయని హెచ్చరించారు. మంచిగా జీవించాలని సీఐ సూచించారు. కౌన్సిలింగ్ అనంతరం సిబ్బంది రౌడీ షీటర్లను ఇంటి వద్ద అప్పగించారు. కార్యక్రమంలో ఎస్ఐ ధరేంద్ర, అప్పలరాజు పాల్గొన్నారు.

సాముగరిడీ శిక్షణకు విశేష స్పందన



మెమొంటోలతో క్రీడాకారులు, గ్రామ పెద్దలు, కమిటీ సభ్యులు

కంచరపాలెం: గొల్లకంచరపాలెం శ్రీరామా సేవా సమాజంలో వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా నిర్వహించిన సాముగరిడీకి మంచి ఆదరణ లభించిందని గ్రామాధ్యక్షుడు పల్లా సత్యనారాయణ తెలిపారు. సమాజం ఆధ్వర్యంలో ఆదివారం సీతారామ కల్యాణ మండపంలో జరిగిన వేడుకల్లో సాముగరిడీ గురువు సానబోయిన అప్పలరాజును గ్రామ కమిటీ సభ్యులు, క్రీడాకారులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా అప్పలరాజు మాట్లాడుతూ అంతరించిపోతున్న క్రీడల్లో సాముగరిడి ఒకటని, దానిని నేటి విద్యార్థులకు నేర్పించాలనే తపన ఉందన్నారు. వేసవిలో అనేక మంది క్రీడాకారులు సాముగరిడీ నేర్చుకోవడం అభినందనీయమన్నారు. పల్లా సత్యనారాయణ సొంత నిధులతో క్రీడాకారులకు మెమొంటోలు, ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో వై.వెంకటరావు, పి.వెంటకరమణ, పి.పెంటారావు, ఎస్.సంపత్, డి.రమణ, ఎన్.శంకరరావు, కె.వి.అప్పారావు, నూనెల రామారావు, పల్లా వెంకటరావు, కోనా రాము, పల్లా ధర్మారావు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు కె.పి.రత్నాకర్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

నర్సింగ్ విద్యార్థిని అదృశ్యం



మావూరి వీరమణి

మల్కాపురం: కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ యువతి అదృశ్యమైన ఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. మావూరి వీరమణి కుటుంబంతో కలిసి బర్మా క్యాంప్‌లో నివసిస్తోంది. నర్సింగ్ మొదటి సంవత్సరం పూర్తయింది. ఈ నెల 15న తల్లిదండ్రులతో కాలేజీకి వెళ్తున్నానని చెప్పి తిరిగి ఇంటికి చేరుకోలేదు. దీంతో యువతి బావ నరేంద్ర కంచరపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీఐ ఎస్.విజయ్‌కుమార్ నేతృత్వంలో ఏఎస్ఐ ఆదిరాజు కేసు దర్యాప్తు చేపట్టారు.

వాచ్‌మెన్ మిస్సింగ్..

కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. పట్టాభిరెడ్డితోటకు చెందిన వెన్నెల సింహాచలం ఈ నెల 14వ తేదీ రాత్రి నుంచి కనిపించలేదు. సదరు వ్యక్తి గతేడాది వరకు ఏలూరులో ఉండి, విశాఖకు వచ్చాడు. పట్టాభిరెడ్డి తోటలో కొత్తగా కడుతున్న అపార్ట్‌మెంట్‌లో వాచ్‌మెన్‌గా పనిచేస్తుంటారు. అతడి అన్నయ్య వెన్నెల రామారావు కంచరపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ ఎస్.విజయ్‌కుమార్ నేతృత్వంలో హెడ్ కానిస్టేబుల్ ప్రకాశరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

హెచ్‌ఐవీ రోగులను ప్రేమిద్దాం

మహారాణిపేట: అంతర్జాతీయ ఎయిడ్స్ స్మృత్యంజలి దినం సందర్భంగా ఆదివారం వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు ర్యాలీని ప్రారంభించారు. డీఎంహెచ్‌వో కార్యాలయం నుంచి విప్రో జంక్షన్ వరకు ఈ ర్యాలీ జరిగింది. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ బలమైన సమాజాన్ని నిర్మించడానికి హెచ్‌ఐవీతో జీవిస్తున్న వారి పట్ల ప్రేమ, సంఘీభావం చూపాలన్నారు. కార్యక్రమంలో నోడల్ అధికారి డాక్టర్ రామారెడ్డి, నాగభూషణం, శైలజ, బద్రి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పబ్లిక్ డిమాండ్

రోడ్డెక్కిన మురుగుతో అవస్థలు



శాంతిపురంలో రోడ్డుపై నుంచి ప్రవహిస్తున్న మురుగు నీరు

సీతంపేట: జీవీఎంసీ 25వ వార్డు శాంతిపురంలోని కిన్నెర మెస్ వెనుక రోడ్‌లో డ్రెయిన్ పొంగి పొర్లుతోంది. కాలువలో వ్యర్థాలు పేరుకుపోయి రోడ్డుపై నుంచి మురుగు నీరు ప్రవహిస్తోంది. దీంతో ఆ మార్గంలో వెళ్లాలంటే ఇబ్బందిగా ఉంది. డ్రెయిన్ నుంచి వస్తున్న దుర్వాసన భరించలేకపోతున్నాం. సంబంధిత అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి తగు చర్యలు చేపట్టాలి.

– పి.మోహన్, శాంతిపురం